క్లుప్తంగా

ఆరోగ్యమాత ఆర్‌సీఎం దేవాలయం ప్రారంభం

తుని రూరల్: హంసవరం గ్రామంలో పునర్నిర్మించిన ఆరోగ్యమాత (ఆర్‌సీఎం చర్చ్) దేవాలయాన్ని ప్రారంభించారు. ఎనిమిది దశాబ్దాల తర్వాత అత్య ఆధునికంగా నిర్మించిన చర్చిను విశాఖ అగ్ర పీఠాధిపతి మహా ఘన డాక్టర్ ప్రకాష్ మల్లవరపు, వికార్ జనరల్ ఫాదర్ బాల శౌరి దుగ్గిరంపూడి ప్రారంభించారు. చర్చి ఫాదర్ ప్రతాప్ కుమార్, విచారణ కర్తలు, సంఘ సభ్యుల ఆధ్వర్యంలో వివిధ విభాగాలను ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భారీ అన్నసంతర్పణ చేశారు. సర్పంచ్ రాయి మేరీఅవినాష్, మాజీ సర్పంచ్ అత్తి వెంకటరమణ, రాయి దాసు క్రైస్తవులు పాల్గొన్నారు.

సిరిపురంలో భూ రీసర్వే



సిరిపురంలో సర్వే ప్రారంభిస్తున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పొన్నాలు

ఏలేశ్వరం: రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో సిరిపురం గ్రామంలో గురువారం భూ సమగ్రత సర్వే కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పొన్నాలు కార్యక్రమంలో భాగంగా సర్వేను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ భూ సమగ్రత సర్వే పథకంలో భూములను రీ సర్వే చేస్తున్నారన్నారు. దీని ద్వారా భూసమస్యలు పరిష్కామవుతాయన్నారు. శాశ్వత భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. పంచాయతీ కార్యదర్శి రామరాజువర్మ, వైఎస్సార్ సీపీ నేత అల్లం ఆదినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రత్తిపాడు రూరల్: రోడ్డు ప్రమాదంలో గురువారం వ్యక్తి మృతి చెందాడు. ఒమ్మంగి గ్రామానికి చెందిన తాపీ మేస్త్రి గారిపాటి మాణిక్యం(పెద్దకాపు) రాచపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి సైకిల్‌పై తిరిగి వస్తుండగా వెనుక నుంచి క్రైన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో మాణిక్యం తలకు బలమైన గాయం కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తుని రూరల్: తుని రూరల్, అర్బన్ పరిధిలో రెండు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐదు సహాయకుల ఖాళీలు భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు సీడీపీఓ కె.నాగలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు తుని మండలం చామవరం (బీసీఈ), తొండంగి మండలం ఎర్రయ్యపేట (బీసీఈ)లో ఖాళీలు ఉన్నాయన్నారు. అంగన్‌వాడీ సహాయకుల పోస్టులు తుని పట్టణంలో ఉప్పరగూడెం (ఎస్సీ), తొండంగి మండలం పి.అగ్రహారం (బీసీఈ), తుని మండలం అటికవానిపాలెం (బీసీఈ), తేటగుంట శివారు గవరపేటలో (ఓసీహెచ్‌హెచ్), హంసవరం శివారు జిల్లేడుపాడు (ఎస్టీ) ఖాళీలు ఉన్నాయన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై, వివాహితులై ఉండాలన్నారు. స్థానికురాలైనట్టు తహసీల్దార్ నుంచి ధ్రువీకరణ పత్రం దరఖాస్తుతో జత చేయాలన్నారు. 2022 జూలై ఒకటికి 21 సంవత్సరాలు నిండి, 35 సంవత్సరాలు లోపు వయస్సు ఉండాలన్నారు. అర్హులైన దరఖాస్తుదారులను సెలక్షన్ కమిటీ ద్వారా ఇంటర్వ్యూ చేసి ఎంపిక చేస్తారన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను మే ఎనిమిదో తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు మా కార్యాలయంలో అందజేసి రసీదు పొందాలన్నారు. దరఖాస్తులను తమ కార్యాలయంలో అందిస్తున్నట్టు ఆమె వివరించారు.

లిబరేషన్ పార్టీ ధర్నా



ధర్నా చేస్తున్న సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ కార్యకర్తలు

రౌతులపూడి: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ కార్యకర్తలు గురువారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కామిరెడ్డి నారాయణ మూర్తి, మానకొండ లచ్చబాబు తదితరులు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ప్రజలపై ధరల భారం మోపుతోందన్నారు.

శిక్షణ పూర్తి చేసుకున్న అసిస్టెంట్ కలెక్టర్

సామర్లకోట: అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖార్ జైన్ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ విధులపై నాలుగు వారాలుగా పొందుతున్న శిక్షణ గురువారంతో ముగిసింది. కార్యాలయ సిబ్బంది ఆయనను సత్కరించి వీడ్కోలు పలికారు. ప్రఖార్ జైన్ మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయంలో అనేక విషయాలు తెలుసుకున్నానని, తనకు సహకరించిన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, డిప్యూటీ తహసీల్దార్ ఆర్ శ్రీనివాసరావు, ఆర్‌ఐ ఎం.రాజేష్, వీఆర్వోలు పాల్గొన్ని వీడ్కోలు పలికారు.

ఉపాధికి నిలయాలు.. తాండ్రబట్టీలు

- వేసవిలో తాండ్ర తయారీ కేంద్రాలు
- రోజుకు రెండు టన్నుల తయారీ
- సుమారు వెయ్యి మందికి ఆధారం



కొమ్మనాపల్లి తాండ్ర బట్టీలో మామిడి తాండ్ర పోత పోస్తున్న కూలీలు

తొండంగి: వేసవి వచ్చింది. మామిడి సీజన్ తెచ్చింది. తాండ్ర తయారీ మొదలైంది. ఈ తాండ్ర బట్టీలపై ఎంతో మంది ఆధారపడి ఉపాధి పొందుతున్నారు. మండలంలోని రావికంపాడు, పి.ఇచిన్నాయపాలెం, ఎ.కొత్తపల్లి, శృంగవృక్షం, కొమ్మనాపల్లి, సీతారాంపురం, బెండపూడి తదితర ప్రాంతాల్లో మామిడి తోటలు ఎక్కువగా ఉన్నాయి. సుమారు 1800 ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ఈ గ్రామాలు తాండ్ర తయారీకి పెట్టింది పేరు. ప్రస్తుతం మామిడి కాయల ఉత్పత్తి జరుగుతుండడంతో తాండ్ర తయారీ కేంద్రాలు తెరుచుకున్నాయి. దీంతో కూలీలకు ఉపాధి లభించింది. మండలంలో సుమారు 15 తాండ్రబట్టీలు ఉన్నాయి. కొందరు రైతులు, వ్యాపారులు కలిసి ఈ తాండ్ర తయారీని చేస్తున్నారు. మామిడి తోటల లోనే యంత్ర సామగ్రి ఏర్పాటు చేసి, వివిధ ప్రక్రియల ద్వారా తాండ్రను తయారు చేస్తున్నారు. రోజుకి సుమారు 5 నుంచి 6 టన్నుల కాయలను వినియోగిస్తుంటారు.

తాండ్ర తయారీ ఇలా..

మామిడి కాయలను కోసి శుభ్రం చేస్తారు. తర్వాత టెంకను వేరు చేసి ముక్కలను పలుపు యంత్రంలో వేసి గుజ్జును తీస్తారు. ఈ విధంగా వచ్చిన గుజ్జును పాకంగా మార్చి, బెల్లంను గుండగా చేసి కలుపుతారు. తరువాత ఎండలో వేసి బట్టీ చాపలపై పారలుగా ప్రతి పది నిమిషాలకు ఎండ తీవ్రతను బట్టి కూలీలు పొరలుగా పోస్తారు. టన్ను మామిడి కాయలకు సుమారు మూడు క్వింటాల బెల్లం వినియోగిస్తుంటారు. రోజుకి సుమారు 13 క్వింటాల్ బెల్లం ఉపయోగిస్తారు. రోజుకు సగటున టన్నున్నర నుంచి రెండు టన్నుల వరకూ మామిడి తాండ్ర తయారవుతుంది.

వెయ్యి మందికి ఉపాధి

తాండ్ర తయారీ ప్రక్రియ చేయడానికి సుమారు 70 నుంచి 80 మంది కూలీలు నిత్యం పని చేస్తుంటారు. మామిడి గుజ్జు, బెల్లం కలిసిన పాకం తయారీకి మగవారు 20 మంది, చాపలపై పోత పోసేందుకు మహిళలు 60 మంది వరకూ పని చేస్తుంటారు. వీటి ద్వారా పరిసర గ్రామాల సుమారు వెయ్యి మందికి పైగా ఉపాధి లభిస్తుంది. ఒక్కో మహిళా కూలీకి రోజుకు రూ.250 నుంచి 300, మగ కూలీకి రూ.300 నుంచి 500 వరకూ ఇస్తుంటారు. ఈ పనులు వేసవిలో 50 నుంచి 60 రోజుల పాటు మాత్రమే ఉంటాయి.



మామిడి కాయలను శుభ్రం చేస్తున్న కూలీలు

ఉత్పత్తి పెరిగినా..

ప్రస్తుతం మార్కెట్‌లో మామిడి తాండ్ర కిలో రూ.50 నుంచి రూ.55 మాత్రమే ఉండడంతో గిట్టుబాటు కావడంలేదు. ఇటీవల సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో తాండ్ర తయారీలో యంత్రాల వినియోగం పెరిగింది. దీంతో తాండ్ర ఉత్పత్తి కూడా పెరిగింది. ఉత్పత్తి పెరినప్పటికీ ఆశించిన స్థాయిలో డిమాండ్ పెరగడం లేదని నిర్వాహకులు వాపోతున్నారు. కొమ్మనాపల్లి, పి.ఇచిన్నాయపాలెం గ్రామాల్లో తయారైన మామిడి తాండ్ర జిల్లాలో పలు ప్రాంతాలకు మాత్రమే కాకుండా ఒడిశా, ఢిల్లీ, నాగపూర్ వంటి సుదూర ప్రాంతాలకు ఎగుమతి అవుతుంది.

ఖర్చులు పెరిగినా..



నిర్వహణ ఖర్చులు పెరిగాయి. ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. కోవిడ్ అనంతరం పంచదార, బెల్లం, మామిడి ధరలు పెరిగాయి. అదే రీతిలో తాండ్ర ధరలు పెరగకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. ఏటా అలవాటుగా ఉండడంతో తాండ్ర తయారీ నిర్వహిస్తున్నాం.

– బి.రామకృష్ణ, నిర్వాహకుడు, కొమ్మనాపల్లి

ఉపాధి ఉంటోంది



కేంద్రంలో రోజుకి 50 మందికి పైగా పని చేస్తున్నాం. వేసవిలో ఇతర పనులు నిత్యం ఉండకపోవడంతో తయారీ కేంద్రంలోనే పని చేస్తున్నాం. తాండ్ర తయారీ వల్ల మాకు ఉపాధి లభిస్తోంది.

– ఎం. సత్యవతి, గోర్సపాలెం, తొండంగి మండలం

30 నుంచి తంటికొండ వెంకన్న కల్యాణోత్సవాలు

గోకవరం: తంటికొండ గ్రామంలో వెంకటగిరి కొండపై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు ఈనెల 30వ తేదీ నుంచి మే 6వ తేదీ వరకూ జరుగుతాయని దేవస్థానం ఈఓ ఆర్‌వీ చందన గురువారం తెలిపారు. ఏడు రోజుల పాటు నిర్వహించే ఈ కల్యాణోత్సవాల్లో తొలిరోజు స్వామి, అమ్మవార్లను పెళ్లికుమారుడు, పెళ్లి కూతురుగా చేస్తారన్నారన్నారు. మే ఒకటో తేదీన రాత్రి ఏడు గంటలకు ఆలయ ప్రాంగణంలోని మండపంలో స్వామి వారి కల్యాణోత్సవం జరుగుతుందన్నారు.

వైభవంగా ప్రసన్న వేంకటేశ్వరుని శోభాయాత్ర



శోభాయాత్రలో ఊరేగుతున్న స్వామిఅమ్మవార్లు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం నుంచి మే ఐదో తేదీ వరకు జరిగే శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం మాలధారణ చేసిన భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. పలువురు భక్తులు ఉదయం స్వామివారి మాలధారణ చేశారు. సాయంత్రం అర్చకులు, మాలధారణ పరులు, భక్తులు గ్రామంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులను విశేషంగా ఊరేగించారు. పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మహిళల ఉపాధికే అధిక ప్రాధాన్యం

మంత్రి దాడిశెట్టి రాజా



అంగన్‌వాడీ కార్యకర్తలకు నియామక పత్రాలను అందజేస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని: మహిళా సంక్షేమం, ఉపాధి కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. గురువారం ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయంలో ఐసీడీఎస్ పరిధిలో నూతనంగా ఉద్యోగంలో చేరిన అంగన్‌వాడీలు, ఆయాలకు ఆయన నియామక పత్రాలను అందజేశారు. తొండంగి మండల వేమవరం, పెరుమాళ్లపురం, కోటనందూరు మండలం కేఈ చిన్నాయిపాలెం, తుని పార్కువీధి కేంద్రాలకు పోస్టుల్లో చేరిన వారికి నియామక పత్రాలను అందజేశారు. బాలల వికాసం, గర్భిణులు, కిశోర్ బాలికల సంరక్షణకు కృషి చేయాలని సూచించారు. తుని ఐసీడీఎస్ సీడీపీవో కె.నాగలక్ష్మి, వైఎస్సార్ సీపీ తుని నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు ఏలూరి బాలు, తాండవ సుగర్ ఫ్యాక్టరీ మాజీ చైర్మన్ నాగం దొరబాబు, ఏసీడీపీవో నిహారిక, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, సరస్వతి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకు ముందుంటా

ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబుకు వెంకన్న చిత్రపటం ఇచ్చి సత్కరిస్తున్న నాయకులు

జగ్గంపేట: నియోజకవర్గంలోని ఉపాధ్యాయులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు ముందుంటానని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. జగ్గంపేటలోని గోకవరం రోడ్డులో నూతనంగా నిర్మించిన యూటీఎఫ్ అదనపు భవనం, గోల్డెన్ జూబ్లీ మీటింగ్ హాల్‌ను ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఉపాధ్యాయులందరూ నూతన భవనం నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. భవనానికి తన వంతు విరాళంగా రూ.50వేలను యూటీఎఫ్ సీనియర్ నేత తోలేటి సూర్యనారాయణ, ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు చేతుల మీదగా సంఘానికి అందచేశారు. అనంతరం ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబును యూటీఎఫ్ నేతలు ఘనంగా సత్కరించారు. రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.అన్నారం, సీనియర్ నాయకులు గారా చిట్టిబాబు, రాష్ట్ర పూర్వపు కార్యదర్శి జి.ప్రభాకర్ వర్మ, కాకినాడ జిల్లా అధ్యక్షుడు కె.వి.వి నాగేశ్వరరావు, కార్యదర్శి ఎం.వి.సాయిరాం పాల్గొన్నారు.

పాఠశాలల పనితీరుపై సోషల్ ఆడిట్



పాఠశాలలో సోషల్ ఆడిట్‌పై సూచనలిస్తున్న దృశ్యం

తుని రూరల్: ఎస్.అన్నవరంలోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల పనితీరు, మూల్యాంకనం, ప్రగతిపై ప్రధానోపాధ్యాయిని ఎం.లీలాకుమారి ఆధ్వర్యంలో సామాజిక తనిఖీపై అవగాహన సదస్సు జరిగింది. గురువారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొని మనబడి నాడు–నేడు, జగనన్న విద్యా కానుకలు, మధ్యాహ్నం భోజన పథకం, విద్యా ప్రగతిపై చర్చించారు. పాఠశాల పరిరక్షణా బాధ్యతలపై సలహాలు సూచనలు చేశారు. బాలికలపై బ్యాడ్ టచ్, గుడ్ టచ్, అభద్రతా తదితర అంశాలను చర్చించారు. మహిళా కానిస్టేబుల్ కె.సరోజిని, ఎస్ఎంసీ చైర్మన్ కె.శ్రీను, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులకు శిక్షణ

కిర్లంపూడి: స్థానిక ప్రజాపరిషత్ సమావేశపు హాలులో ఎంఈఓ టి.జోసఫ్ ఆధ్వర్యంలో గురువారం పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సామాజిక తనిఖీలపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యార్థుల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని పాఠశాలలో జరిగే ప్రతి అభివృద్ధి పనిలోనూ పారదర్శికంగా ఉండేందుకు సామాజిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఎప్పటికప్పుడు పాఠశాలలో జరిగే అన్ని అంశాలను యాప్‌లో పొందిపరచాలన్నారు. శిక్షణా తరగతులకు రిసోర్స్ పర్సన్ యం.శివ, ఎంఆర్‌సీలు శ్రీను, గోవిందరాజు, బాబ్జి పలువరు ఉన్నారు.

పాఠశాల పనితీరుపై అవగాహన కల్పించండి

శంఖవరం: పాఠశాల పనితీరు, నిర్వహణపై పాఠశాల పేరెంట్స్ కమిటీ సభ్యులు పూర్తి అవగాహన కల్పించాలని ఎంఈఓ ఎస్వీ రమణ అన్నారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో స్కూల్ సోషల్ ఆడిట్ కార్యక్రమం పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎ సుబ్బిరెడ్డి, సీఆర్పీలు ఉపాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన

జగ్గంపేట: స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాల్‌లో కమ్యూనిటీ పారా మెడిక్స్, పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం క్యాన్సర్, గుండె, మెదడు, సంబంధించి వ్యాధులపై వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు జరిగింది. పీఎంపీ జగ్గంపేట, గండేపల్లి మండలాల అధ్యక్షులు టి.ఎస్.మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో రాజమండ్రికి చెందిన డెల్టా హాస్పిటల్ డాక్టర్లు క్యానర్, గుండె, న్యూరోకు సంబంధించిన సమస్యలపై వివరించారు. ఇలాంటి సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇంటర్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ



యెడగల భాగ్యశ్రీ (983)



గిడుతూరి విజయ దుర్గ (979)



నట్టే దీపిక (975)

ప్రత్తిపాడు రూరల్: ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్ష ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు నియోజకవర్గ స్థాయిలో అత్యధిక మార్కులు సాధించారని ప్రత్తిపాడు అఖిల్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ ఇనకోటి గంగాధర్ అన్నారు. ఇంటర్ మొదటి సంవత్సర ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు కొప్పన ఉమానాగేశ్వరి 460, కందా శ్రావ్య 457 మార్కులు సాధించారన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 1000 మార్కులు యెడగల భాగ్యశ్రీ 983 మార్కులు, గిడుతూరి విజయదుర్గ 979 మార్కులు, నట్టే దీపిక 975 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. ఈ పరీక్షల్లో 262 మంది పరీక్షలకు హాజరుకాగా 233 మంది విద్యార్థులు (89 శాతం) ఉత్తీర్ణత సాధించనట్టు ఆయన తెలిపారు. ఉత్తమ ప్రతిభను సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ గంగాధర్, అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

కిర్లంపూడి: వీరవరం సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు జరుగుతున్న కారణంగా ఆ పరిధిలోని వీరవరం, రాజుపాలెం, రామకృష్ణాపురం, ముక్కొల్లు, తామరాడ, రామచంద్రపురం, గోనేడ, పాలెం గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో జగ్గంపేట డీఈ కె.రత్నాలరావు గురువారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కోటనందూరులో..

కోటనందూరు: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ భీమవరపుకోట ఫీడర్ వార్షిక మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని విద్యుత్ శాఖ ఈఈ రత్నాలరావు గురువారం తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలో ఉన్న కాకరాపల్లి, జగన్నాథపురం, భీమవరపుకోట, ఎస్సార్‌పేట, అప్పలరాజుపేట, బంగారయ్యపేట, బిళ్లనందూరు గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కరెంటు ఉండదన్నారు.

రౌతులపూడి: మండల కేంద్రంలో 33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్, కొట్టం ఫీడర్ పరిధిలో ఉన్న గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జగ్గంపేట ఎక్జ్యుక్యూటివ్ కె.రత్నాలరావు తెలిపారు.

వాహనాల తనిఖీ

జగ్గంపేట: గ్రామంలోని జాతీయ రహదారిపై పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన తనిఖీల్లో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళుతున్న వాహనదారులపై కేసులు నమోదు చేశారు. సర్వీస్ రోడ్డులో వంద మంది ప్రయాణికులతో వెళుతున్న ఐషర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్లకు సన్మానం



ఏలేశ్వరంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: ప్రత్తిపాడు మార్కెట్ కమిటీ డైరెక్టర్లను గురువారం పట్టణంలో ఘనంగా సన్మానించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి ఆధ్వర్యంలో డైరెక్టర్లు సఖిరెడ్డి బుజ్జి, తొండారపు లక్ష్మీ, వైఎస్సార్ సీపీ నాయకులు అల్లం ఆదినారాయణ, వడ్డి శ్రీవాస్తవలకు శాలువలు కప్పి పూలమాలలతో సన్మానించారు. వారు మాట్లాడుతూ మార్కెట్ కమిటీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. తమను డైరెక్టర్‌గా నియమించిన ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ నేతలు అలమండ చలమయ్య, శిడగం వెంకటేశ్వరరావు, బొదిరెడ్డి గోపి, సుంకర రాంబాబు, దోశ కిషోర్, పైల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వంద మందికి కంటి పరీక్షలు



తంటికొండలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గోకవరం: తంటికొండలో గురువారం వైఎస్సార్ కంటి పరీక్షలు, ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ బద్దిరెడ్డి సత్యనారాయణమ్మ ప్రారంభించారు. డాక్టర్ కిరణ్, కంటి డాక్టర్ వెంకట్రావు సుమారు వంద మందికి పరీక్షలు చేసి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు బద్దిరెడ్డి అప్పన్నదొర తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అభివృద్ధికే సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్



సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే పూర్ణచంద్రప్రసాద్

అన్నవరం: ప్రజల అభివృద్ధికే సంక్షేమ పథకాలని, వాటిని వారికి మరింత చేరువ చేయాలని ఎమ్మెల్యే పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక వన్ హోటల్ రిసార్ట్స్‌లో ప్రత్తిపాడు మండల పార్టీ కన్వీనర్లు, నాయకులు, వలంటీర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాలుగేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయాలన్నారు. ఆయనకు ప్రజలందరూ అండగా ఉండేలా కృషి చేయాలన్నారు. నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కుడుపూడి భరత్, లలిత కళల కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్య సృజన, శంఖవరం ఎంపీపీ పర్వత రాజబాబు తదితరులు ప్రసంగించారు. వైఎస్ఎంపీపీ వెంకటరమణ, పత్తిపాడు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ జిగిరెడ్డి రమణమ్మ, డైరెక్టర్ పలివెల శ్యామల, సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్ రాజా, ఉపసర్పంచ్ వెంకన్నబాబు పాల్గొన్నారు.

భగీరథ మహర్షి జయంతి



ఏలేశ్వరంలో భగీరథ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మసిరపు బుజ్జి



పెంటపల్లిలో కేక్ కట్ చేస్తున్న సగర సంఘం సభ్యులు

ఏలేశ్వరం: భగీరథ మహర్షి జయంతిని పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ కొండలరావు ఆధ్వర్యంలో భగీరథ మహర్షి చిత్రపటానికి వైస్ చైర్‌పర్సన్ మసిరపు బుజ్జి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భగీరథ మహర్షి జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రజల దాహార్తి తీర్చేందుకు గంగాదేవిని భువికి తీసుకువచ్చిన మహా ముని భగీరథుడని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అలమండ చలమయ్య, శిడగం వెంకటేశ్వరరావు, సుంకర రాంబాబు, తొండారపు రాంబాబు, యండగండి నాగబాబు, మసిరపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెంటపల్లిలో భగీరథ జయంతి

గోకవరం: పెంటపల్లి గ్రామంలో గురువారం సగర సంఘం ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై యు.వి.శివ నాగబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ యువకులు భగీరథుని జీవిత చరిత్రను భావితరాలకు అర్థమయ్యే రీతిలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం కేక్‌ను కట్ చేశారు. సంఘం నాయకులు, యవకులు పాల్గొన్నారు.

కల్వర్టు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

జగ్గంపేట: గ్రామంలోని శ్రీరామ్‌నగర్ నుంచి గోకవరం రోడ్డుకు వెళ్లే ప్రాంతంలో నూతనంగా కాలువపై నిర్మిస్తున్న కల్వర్టు పనులను ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు గురువారం పరిశీలించారు. జరుగుతున్న పనులు గురించి గ్రామ ఉప సర్పంచి బండారు రాజాను అడిగి తెలుసుకున్నారు. ఈ నిర్మాణంతో రోడ్డులో ట్రాఫిక్ సమస్యకు కొంత ఉపశమనం కలుగుతుందన్నారు. రామవరం గ్రామ సగరుపేటలో భగీరథ మహర్షి విగ్రహానికి ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా భగీరథ మహర్షి గొప్పతనాన్ని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్ సీపీ సీనియర్ నేత సూర్యనారాయణరాజు, గ్రామ ప్రముఖులు వైఎస్సార్ సీపీ నేతల,సగర సంఘం నేతలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

రాజమండ్రి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పెళ్లి కాని యువతీయువకుల కుటుంబ సభ్యులను గురువారం ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పరామర్శించారు. మండలంలోని జె.కొత్తూరు గ్రామంలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి తెలిపారు. జగ్గంపేట నియోజకవర్గానికి చెందని యువతి, యువకుడు పెళ్లి కాకుండానే ప్రమాదంలో మరణించడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ అత్తులూరి నాగబాబు, జె.కొత్తూరు గ్రామ సర్పంచి నకిరెడ్డి నాగేశ్వరరావు, గ్రామ వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

ఖరీఫ్ ధాన్యం కొనుగోలు చేయాలి

గోకవరం: ఖరీఫ్‌లో పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని గాదెలపాలెంకు చెందిన కౌలు రైతులు గురువారం డిమాండ్ చేశారు. గురువారం వారు మాట్లాడుతూ ఖరీఫ్‌లో సుమారు 150 ఎకరాల్లో పండించిన పంటను ఆర్‌బీకేల వద్దకు తీసుకువెళ్లగా వ్యవసాయశాఖ అధికారులు కేవలం రబీ పంటను మాత్రమే కొనుగోలు చేస్తామని చెబుతున్నారన్నారు. దీనివల్ల తాము నష్టపోయే ప్రమాదం ఉందని, దీనిపై అధికారులు స్పందించి ఖరీఫ్‌లో సాగు చేసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని వారు కోరారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

గోకవరం: పామాయిల్, కొబ్బరి సాగులో సస్యరక్షణ చర్యలు పాటించడం వల్ల ఆశించిన స్థాయిలో దిగుబడి సాధించవచ్చని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కిశోర్ అన్నారు. గోకవరంలో గురువారం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో పామాయిల్, కొబ్బరి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తోటల్లో చీడపీడల నివారణ కోసం పసుపురంగు అట్టలు, ఆముదం రాసిన అట్టలు చెట్లకు కట్టాలని, దీని ద్వారా తెల్లదోమ ఉధృతి తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఓ పి.రిని, ఇతర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తెల్లదోమ నియంత్రణపై అవగాహన

గండేపల్లి: మల్లేపల్లిలో రహదారిని ఆనుకుని ఉన్న మంగళవాని చెరువు ఎదురుగా పామాయిల్ తోటలో మండల ఉద్యాన అధికారి పి.లావణ్య ఆధ్వర్యంలో గురువారం తెల్లదోమ నియంత్రణపై రైతులకు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అంబాజీపేట కొబ్బరి పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ఎంవీవీ చలపతి, జిల్లా ఉద్యాన అధికారి బీవీ రమణ ముఖ్య అతిథిగా హాజరై అవగాహన కల్పించారు. కొబ్బరి, పామాయిల్ తోటలలో తెల్లదోమలు ఏ విధంగా ప్రభావం చూపుతాయి, వాటి నివారణ, తదితర అంశాలను వివరించారు. ఉద్యాన అధికారి కనకయ్య, విఏఏలు, వీహెచ్ఏలు, ఆయిల్ ఫామ్ కంపెనీ డీజీఎం ఏఎస్ ప్రకాష్, పతాంజలి ఆయిల్ ఫామ్ కంపెనీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.